షేర్లను ఒడిసిపట్టేద్దాం

ఐపీవో అలాట్‌మెంట్‌లో మీకున్న అవకాశాల్ని పెంచుకోండిలా

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉన్న మదుపరులకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యతగల అంశమే. ఎందుకంటే ఈ ఆఫర్లు అనేకానేక ప్రయోజనాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ పెద్ద ఎత్తున డిమాండ్ కారణంగా ఈ పబ్లిక్ ఇష్యూల్లో షేర్లను దక్కించుకోలేకపోతుంటారు చాలామంది. అందుకే కొన్నిరకాల మార్గాల్లో ప్రయత్నిస్తే మదుపరులు తాముల అనుకున్నది సాధించవచ్చు.

ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్లు రోజుకో రికార్డు స్థాయిని తాకుతున్నాయి. ఒకప్పుడు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్‌పట్ల పెద్దగా ఆసక్తి చూపనివారే ఎక్కువ. కానీ ఇప్పుడు అంతా అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈక్విటీ పెట్టుబడులపై పెరిగిన అవగాహనే ఇందుకు కారణం. ఇక ఏదైనా సంస్థ ఐపీవోకు వచ్చినప్పుడు అందులో షేర్లను కొనాలనుకుంటే మీ కుటుంబ సభ్యులందరి పేర్లపైనా దరఖాస్తు చేసుకోవాలి. గడువులోగా ఈ పని పూర్తిచేయాలి. ఇతరత్రా విషయాలకొస్తే..

బహుళ డీమ్యాట్ అకౌంట్లతో

ఒకటికి మించి డీమ్యాట్ అకౌంట్ల ద్వారా పలుమార్లు దరఖాస్తు చేసుకోవడం వల్ల కూడా షేర్లను పొందవచ్చు. మీ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న డీమ్యాట్ ఖాతాలను ఇందుకు వాడుకోండి. దీనివల్ల రిస్క్ ఎక్కువగా ఉన్నప్పటికీ దేనికో ఒకదానికి మీ షేర్ల అలాట్‌మెంట్ జరుగుతుంది. అయితే దరఖాస్తు సమయంలో మీకున్న అన్ని డీమ్యాట్ ఖాతాల వివరాలను పేర్కొనడం తప్పనిసరి.

ఆఖరుదాకా ఆగవద్దు

ఐపీవో వచ్చినప్పుడు గంటల వ్యవధిలోనే రిస్క్ పెరుగుతూ ఉంటుంది. కాబట్టి సమయం ఉన్నదికదా అని ఆఖరు గంటదాకా వేచిచూడవద్దు. చాలావరకు ఐపీవోలు 2 నుంచి 5 రోజుల వ్యవధితో పబ్లిక్ ఇష్యూలకు వస్తూంటాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. రోజులు గడుస్తున్నకొద్దీ సర్వర్లు హ్యాంగైపోవచ్చు. దీనివల్ల మీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

సాంకేతిక సమస్యలపై..

దరఖాస్తు ఫారాల్లో బ్యాంక్/డీమ్యాట్ ఖాతాలు, ఇతరత్రా వివరాలను తప్పుగా పేర్కొనవద్దు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి సరైన వివరాలనే ఇవ్వాలి. లేదంటే మీ అప్లికేషన్లు తిరస్కరణకు గురవుతాయి. ఐపీవోల్లో చాలావరకు బిడ్లు ఇలానే పోతుంటాయి.

మాతృ సంస్థలకు మద్దతుగా

మాతృ సంస్థల్లో మీకు షేర్లున్నట్లైతే వాటి అనుబంధ కంపెనీలు ఐపీవోలకు వచ్చినప్పుడు తప్పక దరఖాస్తు చేసుకోండి. మీ విశ్వసనీయత, దీర్ఘకాలిక అంకితభావం కారణంగా షేర్ల కేటాయింపుల్లో మీకు తొలి ప్రాధాన్యత దక్కగలదు. ఉదాహరణకు ఆర్ఐఎల్‌లో మీకు షేర్లున్నట్లైతే ఆ సంస్థకు అనుబంధంగా ఉన్న రిలయన్స్ జియో, రిలయన్స్ ఫ్రెష్, రిలయన్స్ జ్యుయెల్లర్స్ సంస్థలు ఐపీవోలకు వస్తే వాటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మీకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

చివరగా..

ప్రస్తుతం ఐపీవో మార్కెట్ సందడిగా ఉన్నది. అనేక రంగాల్లోని కంపెనీలు, స్టార్టప్‌లు నిధుల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. కాబట్టి ఈక్విటీ మార్కెట్లలో మదుపుపై ఆసక్తి ఉన్నవారు పెద్దపెద్ద సంస్థలను కాకుండా.. చిన్నచిన్న సంస్థలను ఎంచుకొంటే లాభదాయకం. నష్టాలు వాటిల్లినా పెద్దగా అవి మన పెట్టుబడులకున్న అవకాశాల్ని దెబ్బతీయవు.

గరిష్ఠ ధరకే బిడ్డింగ్

ఐపీవోల్లో షేర్ల ధరల శ్రేణిని గమనించే ఉంటారు. రూ.70-75, రూ.150-160, రూ.500-515 ఇలా రకరకాల బ్యాండ్లలో ఈ ధరలను ప్రకటిస్తారు. ఇందులో మీరు గరిష్ఠ ధరలకు బిడ్డింగ్ చేసినప్పుడే మీకు షేర్లను దక్కించుకోవడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఉదాహరణకు ఐపీవో ప్రైస్ బ్యాండ్ రూ.92-97 మధ్య ఉన్నది. అప్పుడు రూ.97కు షేర్లను కొంటామని మీరు బిడ్లను దాఖలు చేయాలి. తొలి ప్రాధాన్యతగా మిమ్మల్ని పరిగణిస్తారు.

ఒక్క లాట్‌కే దరఖాస్తు

ఐపీవోలో అలాట్‌మెంట్ దక్కాలంటే సింగిల్ లాట్‌కే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. అప్పుడే మీకున్న అవకాశాలు పెరుగుతాయి. సాధారణంగా చిన్న రిటైల్ మదుపరులను ప్రోత్సహించడానికి అలాట్‌మెంట్లలో వారికి తగిన ప్రాధాన్యాన్నిస్తారు. కనుక ఒక్క లాట్‌లోనే దరఖాస్తు చేసుకున్నవారికి ప్రయోజనం ఉంటుంది. ఒక్కో లాట్‌లో సాధారణంగా 100 షేర్లుంటాయి.

ఆర్థిక లక్ష్యాలకు అవరోధాలివే..

ప్రతీ ఒక్కరికీ వారివారి ఆర్థిక లక్ష్యాల సాధనకు నగదే ప్రధానం. కానీ ఆ నగదు పొదుపు విషయంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. అందుకే పట్టుదల, క్రమశిక్షణ, సరైన వ్యూహాలుండాలి. అప్పుడే ఫైనాన్షియల్ గోల్స్ సాకారం కాగలవు. అసలు ఆర్థిక లక్ష్యాల సాధనను ఏవి పక్కదారి పట్టిస్తున్నాయో చూస్తే..



క్రమశిక్షణారాహిత్యం

క్రమశిక్షణ లేకపోవడం వల్ల ఆర్థిక లక్ష్యాల సాధన జటిలంగా మారుతుంది. ఉదాహరణకు మార్కెట్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ కనిపించిందని, ఇప్పుడున్న ఫోన్ బాగున్నా కొనేయడం అక్షరాలా దుబారానే. అలాగే అనవసరపు టూర్లతోనూ లేనిపోని ఖర్చే. ఇలాంటివన్నీ చాపకింద నీరులా మీ ఆర్థిక లక్ష్యాలను దెబ్బతీస్తాయని మరువద్దు.

ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని మన ఆదాయాలను పెంచుకుంటూపోవాలి. లేకపోతే మన సంపాదన, పొదుపును పెరిగే ధరలు మింగేస్తాయి. అది పిల్లల చదువుకయ్యే ఖర్చులు కావచ్చు లేదా మనం కొనాలనుకునే ఇల్లు కావచ్చు ఏదైనాసరే రోజులు గడుస్తున్న కొద్దీ మరింత ఎక్కువగా నగదును పెట్టాల్సి వస్తుందని మరువద్దు.

అత్యవసరాలు

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం. ముఖ్యంగా వైద్యవసరాలు ఎలా ఉంటాయో కూడా తెలియదు. అనుకోని ఆరోగ్య సమస్యలతో కూడా ఆర్థిక లక్ష్యాలు దెబ్బతింటాయి.

మార్కెట్ ఒడిదొడుకులు

మార్కెట్‌లో నెలకొనే ఒడిదొడుకులు కూడా ఆర్థిక లక్ష్యాలకు ఆటంకమే. పెట్టిన పెట్టుబడుల్లో రాబడులు తగ్గి అనుకున్న స్థాయిలో నగదు సమీకరణలు కష్టమవుతాయి. కాబట్టి మన చేతిలో లేనివాటికి మనం ఏమీ చేయలేం. ఉన్నవాటికైనా జాగ్రత్తతో ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తాం.

మదుపర్లూ అప్రమత్తత అవసరం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకే పెద్దపీట వేస్తున్నారు. గత వారం ట్రేడింగ్‌లో శుక్రవారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,653.37 పాయింట్లు ఎగబాకి తొలిసారి 84వేల మార్కును దాటి ఆల్‌టైమ్ హై 84,544.31 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 434.45 పాయింట్లు ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 25,790.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందంటూ మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26వేల మార్కును నిఫ్టీ తాకవచ్చు. 26,100-26,400 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఇంటికీ బీమా రక్షణ

గృహమే కదా స్వర్గసీమ అన్నారు పెద్దలు. మరి ఆ ఇంటికీ రక్షణ ఉండాలి కదా. అందుకే ఇండ్లకూ ఇన్సూరెన్స్‌లొచ్చేశాయ్. గృహ బీమాను ప్రాపర్టీ ఇన్సూరెన్స్ లేదా హోమ్ ఓనర్ ఇన్సూరెన్స్‌గా కూడా పిలుస్తారు. ఎక్స్‌టీరియర్-ఇంటీరియర్ డ్యామేజీలకు కవరేజీనిస్తుంది. ఇంట్లోని వస్తుసామాగ్రికి కూడా బీమా రక్షణ లభిస్తుంది. ఇంట్లో దురదృష్టవశాత్తూ జరిగే ఏదైనా ప్రమాదాలకూ వర్తిస్తుంది. హోమ్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని ఎస్బీఐ, శ్రీరామ్ జనరల్, బజాజ్ అలియాంజ్, భారతీ యాక్సా, రాయల్ సుందరం, రిలయన్స్, రహేజా క్యూబీఈ, ఓరియంటల్, న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలీ, చోళమండలం వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఇండ్ల యజమానులు, అద్దెకుండేవారు ఈ బీమాను తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు హౌజింగ్ సొసైటీలకూ బీమాను కల్పిస్తున్నాయి. తీవ్రవాదులు దాడి, భూకంపాల్లో ధ్వంసమైనా బీమాను ఇస్తామని మరికొన్ని సంస్థలు ప్రకటిస్తున్నాయి.

కవరేజీ ఇలా..

షరతులు, ప్రీమియంలనుబట్టి ఆయా సంస్థలు.. అగ్ని ప్రమాదాలు, డాక్యుమెంట్ల నష్టం, దొంగతనాలు, గృహోపకరణాల డ్యామేజీ, వ్యక్తిగత ప్రమాద బీమా, అద్దె ఎగవేత, పెంపుడు జంతువుల సంరక్షణ, ఇల్లు పూర్తిగా దెబ్బతింటే ప్రత్యామ్నాయ వసతి ఖర్చులు, బ్యాగేజీ నష్టం, థర్డ్ పార్టీ-ఎంప్లాయ్ లయబిలిటీస్, ఎలక్ట్రికల్ ఫెయిల్యూర్ కవరేజీలను అందిస్తున్నాయి. ఇంట్లోని విలువైన ఎలక్ట్రిక్-ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, ఆభరణాలకూ బీమా కవరేజీ ఉంటుంది. ప్రకృతి విపత్తుల్లో ధ్వంసమైనా, అల్లర్లతో ప్రభావితమైనా ఇన్సూరెన్స్‌ను పొందవచ్చు. ఒకవేళ గృహ రుణం పరిధిలో ఇల్లు ఉన్నట్లైతే ప్రీమియంలు అధికంగా ఉంటాయి.

పాలసీ కాలపరిమితి

గృహ బీమా పాలసీలు దీర్ఘకాలానికిగాను కొనుక్కోవచ్చు. అలాగే కనిష్టంగా ఏడాది కాల పరిమితితో కూడా తీసుకోవచ్చు. ఇండిపెండెంట్ హౌజ్‌లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు అనుగుణంగా ఈ పాలసీల కవరేజీని ఎంచుకోవచ్చు. నివాస ప్రాంతాన్నిబట్టి, పాలసీ వ్యవధి ఆధారంగా ప్రీమియంలుంటాయి. అయితే వాటిల్లిన నష్టానికి కారణం ఉద్దేశపూర్వక చర్యేనని తేలితే బీమా వర్తించదు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన అనన్యకు సన్మానం

- ప్రశంసాపత్రం, నగదు అందజేసిన చినజీయర్ స్వామి

అనన్యను అభినందిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి

ధర్పల్లి, సెప్టెంబర్ 22 : మండలకేంద్రంలోని లిటిల్‌హార్ట్స్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని దాసరి అనన్య ప్రజ్ఞావికాస్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లో ప్రజ్ఞావికాస్ కార్యాలయంలో శనివారం రాత్రి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అనన్యను శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, హెచ్ఎం సాధన హర్షం వ్యక్తం చేశారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 22 : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి అండర్ -17 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 24న ఉదయం 9 గంటల వరకు రిపోర్ట్ చేయాలని, మరిన్ని వివరాలకు సంతోష్ -9440926006 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

25 ఏండ్లకు కలుసుకున్న స్నేహితులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1999-2000 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

సారంగాపూర్, సెప్టెంబర్ 22 : నగరంలోని వివేకానంద విద్యాలయంలో చదువుకున్న 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు 25 ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. నగర శివారులోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో ఉన్న లహరి హోటల్ ఇందుకు వేదికైంది. చాలా ఏండ్ల తర్వాత ఒకే వేదికపై స్నేహితులంతా కలుసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని, రోజంతా సందడిగా గడిపారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివేకానంద విద్యాలయ వ్యవస్థాపకుడు రవికాంత్, ఉపాధ్యాయులు శివకుమార్, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు సోమ శివకుమార్, స్వప్న, ఆజాద్, సునీత, రవి, రాజేందర్, ప్రశాంత్, సాలూగారి మోహన్‌తో పాటు సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవం సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి నాయకుడు జి.శివ

పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు..

బోధన్, సెప్టెంబర్ 22: పీడీఎస్‌యూ స్థాపించి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని బోధన్‌లో పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలను వారు గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థి నాయకులతో పాటు ఈ సమ్మేళనంలో పీడీఎస్‌యూ ప్రస్తుత నాయకులు పాల్గొన్నారు. 1977 నుంచి 1983 వరకు పీడీఎస్‌యూలో వివిధ హోదాల్లో జిల్లా, రాష్ట్ర నాయకుడిగా పనిచేసి, అనంతరం వివిధ ప్రజాసంఘాల్లో పనిచేసిన జి.శివరాజు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యావిధానం కోసం, సమసమాజం కోసం నాడు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమాలు నడిపామని, పీడీఎస్‌యూ నిర్మాత జేసీఎస్ ప్రసాద్ బోధన్ ప్రాంతంవాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు. రంగవల్లితోపాటు అనేక మంది విద్యార్థి నాయకులను బోధన్ అందించిందన్నారు. పీడీఎస్‌యూ స్థాపించి 50 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ సభను ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 30న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుత విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆయన కోరారు. పీడీఎస్‌యూ ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు డి.నరేందర్, కార్యదర్శి కర్క గణేశ్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి నాయకులు నాడు చేసిన పోరాటాలు తమకు స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. అనంతరం స్వర్ణోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మాజీ నాయకులు డి.సంజీవ్, గంగారాం, బి.మల్లేశ్, లింగం, గణేశ్, ప్రస్తుత పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు డి.నరేందర్, కార్యదర్శి కర్క గణేశ్, నాయకులు మౌనిక, గంగా కిశోర్, మహిపాల్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కె.గంగాధర్, డి.రాజేశ్వర్, కె.రవి, ఐఎఫ్‌టీయూ నాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్వార్టర్ ఫైనల్‌లో నిజామాబాద్ జిల్లా జట్లు

క్వార్టర్ ఫైనల్‌కు ఎంపికైన క్రీడాకారులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 21 నుంచి 23 వరకు కొనసాగే 10వ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన బాలికల జట్టు ప్రతిభ చూపి ఫైనల్‌కు చేరింది. పెద్దపల్లి, హన్మకొండ, నిర్మల్, కరీంనగర్ జట్లపై గెలుపొంది క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. బాలుర జట్టు వరంగల్, మహబూబాబాద్, సిద్దిపేట్, కరీంనగర్ జట్లపై గెలుపొంది, క్వార్టర్ ఫైనల్‌కు చేరినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్లకు జిల్లాలోని పలు సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

కోతకు గురవుతున్న చెరువుకట్టకు మరమ్మతులు చేయించాలి

కోతకు గురవుతున్న చెరువుకట్టను చూపుతున్న రైతులు

రుద్రూర్, సెప్టెంబర్ 22 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రుద్రూర్ చెరువు కట్ట కోతకు గురయ్యిందని, మరమ్మతులు చేయించాలని స్థానిక రైతులు ఆదివారం కోరారు. చెరువు ఆయకట్టు కింద సుమారు 2500 ఎకరాల పంటలు సాగవుతాయని, చెరువు కట్ట తెగిపోతే తీవ్రస్థాయిలో నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కట్టపై వేసిన బీటీ రోడ్డు కూడా సగభాగం ధ్వంసమైందని తెలిపారు. అధికారులు స్పందించి తూములు, కోతకు గురవుతున్న చెరువుకట్టకు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు అడప సాయిలు, గ్రామాధ్యక్షుడు ప్రవీణ్, రైతులు గజేందర్, ఉప్పు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన నీటి మట్టం

కందకుర్తి నదిలో బయట పడుతున్న శివాలయ శిఖరం

రెంజల్, సెప్టెంబర్ 22: పది రోజులుగా పొంగి ప్రవహించిన గోదావరిలో నీటి మట్టం స్వల్పంగా తగ్గింది. నదిలో పురాతన శివాలయ శిఖర పైభాగం ఆదివారం బయటపడింది.

విమర్శలు మాని, హామీలను అమలుచేయాలి

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని, ఇతర పార్టీల నాయకులను విమర్శించడం మానుకొని, ఇచ్చిన హామీలను అమలుచేయాలని బీఆర్ఎస్ నాయకులు చక్రపాణి కృష్ణ, నల్లవెల్లి సాయిలు, పద్మరావు, ఒడ్డెం నర్సయ్య, దాసరి లక్ష్మీనర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పాల్గొని, పార్టీలో ఎంతో పనిచేశారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులే తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరించకుండా, ఆరు గ్యారెంటీలను అమలుచేయకుండా విమర్శించే నాయకులను ప్రతివిమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తానని చెప్పి ఇంతవరకూ అమలుచేయలేదని, రైతు రుణమాఫీకూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదని అన్నారు. సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం అర్థరహితమని, అమృతాపూర్ గంగాధర్ స్థాయిని మరిచి విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల ఆత్మబలిదానాలు చేసుకోవడానికి కారణం కాంగ్రెస్ నాయకులు కాదా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకుడు ఒడ్డెం నర్సయ్య, నల్లవెల్లి సాయిలు, సూదం నాయక్, కుమ్మరి గంగాధర్, నయీంఖాన్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాలిక కిడ్నాప్.. ఇద్దరిపై కేసు నమోదు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 22 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఖలీల్‌వాడి ప్రాంతం నుంచి ఓ బాలికను కిడ్నాప్ చేశారని బాలిక కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా.. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు వెల్లడించారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఆటోనగర్ ప్రాంతానికి చెందిన నసీరా బేగం (16) ఈనెల 19న నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్సపొందుతున్న తన అక్క వద్దకు వెళ్లింది. ఆ బాలికను ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లినట్లు బాలిక తల్లి రయీసాబేగం ఫిర్యాదు చేయగా.. నగరంలోని ఎన్ఆర్ఐ కాలనీకి చెందిన ఫజల్ కరీం, ఖాదర్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు. కిడ్నాపర్లు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడ ఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ రద్దీ నెలకొంటున్నది. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. దేవీమాత ఆలయానికి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడం, వాహనాలను దుకాణాల వద్ద నిలపడంతోపాటు గంజ్‌కు వెళ్లే వారు, రోడ్లపై కూరగాయల విక్రయాలతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం ఆఫీసులు, కళాశాలలకు వెళ్లేవారు, సాయంత్రం తిరిగి ఇండ్లకు వెళ్లే సమయంలో విపరీతంగా ట్రాఫిక్ జామ్ అవుతున్నది. ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్